## కాలే కడుపు కోసం పడుపు వృత్తిచేసే ఆ అభాగ్యురాలి జీవితం ఏమైంది?

# సామ్మలక్ష్మీరాజ్ కథ

## నీలి

చలిగాలి రివ్వున వీస్తోంది. రోడ్డుపై వాహనాల రొద...

చీకటి మెల్ల మెల్లగా ముసురుకుంటూ..

అప్పటికి ఎంతసేపట్నుండి నించుందో.. కాళ్ళు పీకేస్తున్నాయ్ నీలికి. ఓ పక్క కడుపులో ఆకలి దంచేస్తోంది. దీపస్తంభం వెలుగులో ఆమె కట్టుకున్న చవకబారు సిల్కు చీర వెలసిపోయిన జాకెట్టు పేదరికాన్ని వేలెత్తి చూపిస్తూ...

అటుగా ఎవరో వస్తున్న అలికిడి...

ఆమె కళ్ళల్లో చిరు ఆశ రెప రెపలాడుతూ...

వాళ్ళు సమీపించారు. ఆమె చిన్నగా నవ్వింది.

"వస్తావా?" గుప్పుమంటోన్న మందు వాసన...

"ఇంతకీ రేటెంత?" జర్దాకిళ్ళీ ప్రశ్నిస్తూ...

"ఇరవై రూపాయలు!" నీలి జవాబులో ఆత్రం...

"అంతెందుకు... పదిహేను చేసుకో!" మందువాసన ఆమెను పైనుండి కింద వరకూ తడిమేస్తూ...

"గట్టనే అయితే! జాగా వున్నదా మీకాడ్క... ఒక్క గంట వుండల్నా? లేక మొత్తం రాత్రంతానా..." అనుమానంగా వాళ్ళని పరీక్షిస్తూ ఆమె...

"లే! లే! ఒక్కగంట సాలు! అదిగో గా స్టేషన్‌కాడ రైల్వే బోగి ఖాళీగానే వుంది. ఆడికి రావాలె..." చేత్తో దూరంగా వున్న రైల్వే స్టేషన్ చూపిస్తూ వాళ్ళు...



"హమ్మో! గాడికా...? రేల్ ఫూర్డ్ కాడికి నేరాను. ఒక్కరని తీస్కుపోతారు. కుక్కల్లా పదిమంది పైన పడతారు. ఛల్! హచ్! వంద రూపాయలిచ్చినా నే రాను ఆడికి" విసురుగా చీదరించుకుని వెనుదిరుగుతూ ఆమె.

"థూ! నీ యవ్వ! నీ ముకాన్కి వంద రూపాయల్! సినిమా స్టార్‌వనుకుంటున్నా

వ్! బద్మాష్ పోరి!" తమని నిరాకరించిందన్న కోపంతో బండ బూతులు తిడ్తూ...

"యిగో! మాటలు మంచిగ రానీయండి! నీ... ఈ... కొడుకుల్ని గింతమందిని చూసినా! బాడకావ్ గాళ్ళు...!" తుప్పుకున్న ఉమ్మేస్తూ... వచ్చి దీపస్తంభాన్ని ఆనుకుని నుంచుందామె.

"ఏందే నీలీ! ఈ పూట బేరాల్లేనట్టున్నాయ్ ?" చేతిమీద పూలదండల్ని వరుసక్రమంలో సర్దుతూ అడిగాడు సూరిగాడు.

"నా సంగతికేంలేగానీ! ఏమైనా దండలమ్మినవా?" నల్లబడ్డ ముఖాన్ని పక్కకు తిప్పుకుంటూ నీలి...

"ఆ...! నాలుగు దండలమ్మినా! నాల్రూపాయలొచ్చినాయ్ . ఇగో... ఈగివికూడా అమ్మేస్తే ఈ పూటకు సాలు... నీలీ... చాయ్ తాగుదాం రారాదే!" జాలి జాలిగా ఆమెను చూస్తూ అడిగాడు అతను.

అయిదడుగుల దూరంలో వున్న టీ బండివైపు నడిచారిద్దరూ...

చాయ్ కప్పు ఇచ్చేసి వెనుదిరిగి వస్తుంటే దూరంగా ఓ ఎర్రప్యాంటు, పచ్చ చొక్కాతో కాస్త నీటుగా దువ్విన క్రాఫ్ కనిపించిందామెకు.

"ఖాళీగానే ఉన్నట్టున్నావ్! వస్తావా?" ఎర్రప్యాంటు క్రాఫ్ సరిచేసుకుంటూ...

"నీలాంటి దొరబాబు అడిగితే కాదంటానా? ఇరవై రూపాయలైతాయి!" మెలికలు తిరిగిపోతూ వయ్యారంగా అందామె.

ఓ క్షణం తటపటాయింపు ఎర్రప్యాంట్లో...

"కానీ... నా కాడ జాగలేదే! ఎల్లనే...!?" ఏమీ తోచనట్టుగా ప్రశ్నిస్తూ...

ఏం పర్లేదు! తియ్యి పైసలు...! అగో ఆ పార్కు కాడికి తీస్కపోతా! పద జల్దీ పద" బేరం కుదిరిందన్న ఆనందం ఆమెలో...

"ఆడనా?! పోలీసొస్తడేమో...! పట్టుకుంటే?" ఎర్రప్యాంట్లో భయం, ఆందోళన తొంగిచూస్తూ...

"లే...! పోలీసన్న మంచోడు. ఏం

## ఎడిటర్!



టిబెటియన్ బుద్ధులకు పరమపూజ్యుడైన శ్రీ దలైలామా 'వోగ్' అనే ఫాషన్ మాగజైన్‌కి ఎడిటర్‌గా వ్యవహరించబోతున్నారు. స్ట్రాస్‌బర్గ్ నుండి విడుదలయ్యే ఈ పత్రికకు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ వంటి ప్రముఖులు ఎడిటర్లుగా వ్యవహరించారు. అత్యంత ప్రతిష్ఠాకరమైన ఈ పత్రికకు ప్రముఖులను ఒక్కో ఇష్యూకి ఎడిటర్లుగా వ్యవహరించమని ఆహ్వానించే సాంప్రదాయం ఉంది. అందువల్లనే ఈసారి శ్రీ దలైలామాగారికి అవకాశం ఇవ్వబడింది. శ్రీ దలైలామాగారి సారధ్యంలో శీతాకాలపు 'వోగ్' తయారై, విడుదలవుతుంది.

—ప్రభాకర్

అనదు. నే చెప్తాగా! పద!'' అతని చేయి పట్టుకుని పార్క్‌లోకి లాక్కుపోతూ...

హఠాత్తుగా పార్క్‌నుండి బయటకొస్తూ ఎదురయ్యాడు వారికి లాఠీతో ఎర్రటోపీ!

అంతే! ఆమె చేయి వదుల్చుకున్న విదిలించి పారేసి వాడుతీశాడా ఎర్రపాంట్ పర్రోడు.

''ఏ! ఏ! ఇంత పిరికి పోరణ్ని నీ జన్మలో చూళ్ళేదు!'' తిట్టుకుంటూ దీపస్తంభం చేరింది ఆమె.

''ఏందే? గాడ వరకూ బోయి మళ్ళొచ్చినావ్?'' కుతూహలంగా ఆమెను తేరపార చూస్తూ అడిగాడు సూరిగాడు.

''యుహ్?! చప్పుడు చేయకుండ వుండు! అసలే పేరాల్లేక నేనేడుస్తుంటే నీ గోలేంది?'' విసుక్కుందామె!

''గీ... తిప్పలన్నీ ఎందుకే...! నీలి... పెళ్ళిచేసుకుందాం. మా ఊరెళ్ళిపోదాం! గాడనే బతుకుదాం. వచ్చేయరాదే నాతో...?'' ఆమె చెంత చేరి ఓ మల్లెదండ మూరనిస్తూ సూరిగాడు...

ఆమెకూ ఈ జీవితం విసుగ్గానే వుంది. రోజూ వొళ్ళమ్ముకుని బతకడం. ఓ పూట కూడా కడుపునిండని లేమితనం! తను తెచ్చే పైసలు కోసం ఇంట్లో ఎదురుచూసే నాలుగు నోళ్ళూ...

పైటేసుకున్న కాడ్నించి వుంచుకుంటామూ... "పైసలిస్తాను'' అని అన్నవాళ్ళే తప్ప పెళ్ళి చేసుకుంటాను. కలిసి బతుకు సాగిద్దాం అన్న సూరిగాడంటే ఓ చిత్రమైన భావన మనసులో మెదులుతూ...


ఆమెలో సంఘర్షణ మొదలవుతూ...

''రేపు చెపుతాలేరా సూరిగా...!'' చిన్నగా గొణిగింది ఆమె.

ఆ మాత్రం మాటకే ఎంతో పొంగిపోతూ అతను... ఉబ్బి తబ్బిబ్బయ్యింది అతని హృదయం.

ప్రేమగా ఆమె చేతిని నిమురుతూ...

''నే పోతున్నా రాత్రయ్యింది. ఈ పూటకెవ్వరూ రారేమో...! ఇంటికి పోరా



దూ...''

''లేదురా...! రేపొద్దుగాలికి చాయ్ కి పైసలు గూడా లేవ్! నువ్వు పో!'' రోడ్డువైపే బేరం కోసం చూస్తూ ఆమె... అయిష్టంగా ఆమెను వదల్లేక వదులుతూ ముందుకు అడుగులేశాడు అతను.

* * *

''ఏందన్నా? నీలి ఇంకా రాలేదూ...! ఒళ్ళు గిట్ల బాలేదా...! నిన్న తిండికికూడా లేకపాయె పైసలు ఆమె కాడ...'' టీ బండి మైసయ్యను ఆత్రుతగా అడిగాడు సూరిగాడు. అప్పటికే నీలి కోసం కలియతిరుగేస్తూ...

''అరె! సూరిగా...! నీకు తెల్వదురా! నిన్న అర్ధరాత్రి కొట్టేందాక గీడనే వుండింది నీలి. అగో టాక్సీలో పది పోరగాళ్ళొచ్చి ఆమెను ఎత్తుకెళ్ళిపోయిన్రు. పొద్దుగాల దావఖానాలో చచ్చి పడుందిరా నీలి. అన్యాయం అయిపోయింది పాపం నీలి'' టీ కలుపుతూ మామూలుగా మైసయ్య తెలియచేస్తున్న వివరాలు...

వినిపించటం మానేశాయ్ అతనికి!

ఒంట్లో నెత్తురు గడ్డకట్టేసినట్టుగా అతను...

మనసంతా వెలితిగా అయిపోతూ...

గుండెల్లో సన్నని బాధ...

''రేపు చెప్తాలేరా'' అంటూ తన నిర్ణయాన్ని రేపటికి వాయిదా వేసిన నీలి...


ఆమె దిగాలు చూపులు...

ఆ మాటలు...

అతని కళ్ళల్లో నీలి రూపం మసకమసగ్గా...

దూరంగా దీపస్థంభం బోసిపోయి...

దిగాలుగా నీలికై నీలి చూపులు చూస్తూ!



డిజైన్: ఆర్.తారాబాలకృష్ణ(హైదరాబాద్)